రంజాన్ వేళలు
ఇఫ్తార్ : ఆదివారం సా : 6.34 గం.
సహర్ : సోమవారం ఉ: 4:48 గం.

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
5 సిద్దిపేట
ఆదివారం 31 మార్చి 2024

వీడలేమంటూ..

పదోతరగతి పరీక్షలు శనివారం ముగిశాయి.. ఇంతకాలం కలిసి చదువుకున్న వారిలో వార్షిక పరీక్షలు ముగిశాయన్న ఆనందం.. మళ్లీ ఎప్పుడో కలుస్తామో అనే బాధతో..ఒకరికొకరు వీడ్కోలు చెప్పుకున్నారు. ఇక హాస్టళ్లలో చదువుతున్న తమ పిల్లలను తీసుకెళ్లేందుకు తల్లిదండ్రులు రావడంతో వారి ఆనందానికి అవధుల్లేవు. కొందరు విద్యార్థులు తమ తల్లిదండ్రుల సెల్‌ఫోన్లలో సెల్ఫీలు తీసుకుని సందడి చేశారు.

- సిద్దిపేట జిల్లా స్టాఫ్ ఫొటోగ్రాఫర్


మిట్టపల్లి గురుకుల పాఠశాలలో గ్రూప్ ఫొటో దిగుతున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు


సిద్దిపేటలో పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు


పరీక్షలు ముగిశాక ఇంటికి పయనమైన విద్యార్థినులు




సెల్ఫీ తీసుకుంటూ..

సమయం లేదు మిత్రమా..

- ఆస్తిపన్ను వడ్డీపై 90 శాతం మాఫీ చేసిన ప్రభుత్వం
- ఈ నెల 1 నుంచి 31 వరకు అవకాశం
- పన్ను చెల్లింపునకు నేడే ఆఖరి తేదీ
- ఇప్పటి వరకు పన్ను వసూళ్లలో సిద్దిపేట మున్సిపాలిటీకి మూడోస్థానం



సిద్దిపేట టౌన్, మార్చి 30: కొన్నేళ్లుగా మున్సిపాలిటీల పరిధిలో పేరుకుపోయిన ఆస్తిపన్ను బకాయిలను వసూలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆస్తిపన్ను వడ్డీపై 90 శాతం మాఫీ చేయడంతో జిల్లాలోని మంచి స్పందన లభిస్తున్నది. జిల్లాలోని సిద్దిపేట, గజ్వేల్, హుస్నాబాద్, దుబ్బాక, చేర్యాల మున్సిపాలిటీల్లో ఆస్తి పన్ను చెల్లించేందుకు గృహ యజమానులు క్యూ కడుతున్నారు. నెల రోజుల నుంచి మున్సిపల్ అధికారులు, సిబ్బంది వసూలు చేస్తున్న ఆస్తి పన్ను విషయంలో రాష్ట్రంలోనే సిద్దిపేట మూడోస్థానంలో ఉంది. ప్రభుత్వం విధించిన గడువు నేడు (ఆదివారం) చివరి రోజు కావడంతో మరింత వసూళ్లు వచ్చే అవకాశాలున్నాయని మున్సిపల్ అధికారులు వెల్లడిస్తున్నారు.

ఐదు మున్సిపాలిటీల్లో

మున్సిపాలిటీల్లో బకాయిపడ్డ ఆస్తి పన్నుపై ఫిబ్రవరి 27న రాష్ట్ర ప్రభుత్వం జీవో విడుదల చేయగా మార్చి 1 నుంచి 90 శాతం వడ్డీ మాఫీ అవకాశాన్ని గృహ యజమానులు వినియోగించుకుంటున్నారు. జిల్లాలోని సిద్దిపేటలో 34,575, గజ్వేల్‌లో 11,500, హుస్నాబాద్ 7,132, దుబ్బాక 6,048, చేర్యాల 4,500 గృహాలున్నాయి. మార్చి 1 నుంచి మున్సిపల్ అధికారులు, సిబ్బంది ప్రతి ఇంటికీ తిరుగుతూ ఆస్తి పన్నును వసూలు చేస్తున్నారు. వీటిలో సిద్దిపేట మున్సిపాలిటీకి రూ. 11.77 కోట్లు, దుబ్బాకకు రూ.1,47,90,000, హుస్నాబాద్‌కు రూ. 1.32కోట్లు, గజ్వేల్‌కు రూ.3.55 కోట్లు, చేర్యాల మున్సిపాలిటీలో రూ.1,47,30,000 కోట్లు వసూలయ్యాయి.


ఆస్తిపన్ను రశీదును గృహ యజమానికి అందజేస్తున్న మున్సిపల్ కమిషనర్ ప్రసన్నరాణి

మూడోస్థానంలో

ఆస్తి పన్ను వసూళ్లలో రాష్ట్రంలోనే సిద్దిపేట మున్సిపాలిటీ మూడోస్థానం దక్కించుకుంది. ప్రభుత్వం ప్రకటించిన ఆఫర్ వినియోగించుకుంటే భారం తగ్గుతుందనే జిల్లాలోని గృహ యజమానులు అనేక మంది ముందుకొచ్చారు. ఫలితంగా సిద్దిపేట మున్సిపాలిటీ మార్చి 30నాటికి 93 శాతం మేర పన్నును వసూలు చేసింది. ప్రతిరోజు ఇంటింటికీ చెత్తను సేకరించేందుకు వస్తున్న వాహనాలకు మైక్ ద్వారా 90 శాతం వడ్డీ మాఫీపై ప్రజలకు అవగాహన కల్పించారు.

నేడే చివరి తేదీ

ఆస్తి పన్నుపై 90 శాతం వడ్డీ మాఫీ నేడు చివరి రోజు కావడంతో గృహదారులు పన్ను చెల్లించేలా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. సిద్దిపేట మున్సిపాలిటీ పన్ను వసూళ్లలో మొదటిస్థానంలో నిలవాలన్న లక్ష్యంతో పాలకవర్గం, అధికారులు, సిబ్బంది ప్రత్యేక చర్యలు తీసుకోనున్నారు. ఆదివారం సెలవు రోజు అయినప్పటికీ ఆస్తిపన్ను చెల్లించేందుకు చివరిరోజు కావడంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు మున్సిపల్ సిబ్బంది కార్యాలయంలో చెల్లింపు కౌంటర్‌ను తెరిచి ఉంచనున్నారు.

అవకాశాన్ని అందిపుచ్చుకోవాలి



రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని గృహ యజమానులు సద్వినియోగం చేసుకోవాలి. సిద్దిపేట మున్సిపల్ దేశంలో, రాష్ట్రంలో అన్నింటా ఆదర్శంగా ఉంది. అలాగే ఆస్తి పన్నులో కూడా ముందుండేలా ప్రజలు సహకరించి సకాలంలో పన్ను చెల్లించాలి. ఇలాంటి అవకాశం మళ్లీ రాదు. పన్ను చెల్లించి యజమానులు భారం తగ్గించుకోవాలి. ఆదివారం వందశాతం పన్ను వసూలయ్యేలా అధికారులు, సిబ్బంది చొరవ తీసుకోవాలి.

- ప్రసన్నరాణి, మున్సిపల్ కమిషనర్, సిద్దిపేట

సిద్దిపేట మున్సిపల్ కార్యాలయం



ముస్తాబైన సిద్దిపేటలోని మసీదు

రంజాన్ వేళ.. సందడి భళా





- హలీంకు ఫుల్ డిమాండ్
- ఆకర్షణీయంగా ఖుర్తాలు, ప్రత్యేక టోపీలు
- కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్న దుకాణాలు
- విద్యుత్ దీపాల వెలుగుల్లో మసీదులు, ఈద్గాలు

ముస్లిం అత్యంత పవిత్రమైన మాసం రంజాన్ పురస్కరించుకుని జిల్లాలో సందడి వాతావరణం నెలకొన్నది. మసీదులు, ఈద్గాలను విద్యుత్ దీపాలతో సర్వాంగసుందరంగా ముస్తాబు చేశారు. ఇక రంజాన్ మాసంలో హలీంకు ఉండే డిమాండ్ అంతా ఇంతా కాదు.. మటన్, చికెన్‌తో తయారు చేసే ఈ హలీం అంటే ప్రతి ఒక్కరూ ఇష్టపడతారు. రంజాన్ మాసం వచ్చిందంటే చాలు హలీం కోసం ఎదురుచూసేవారు ఉన్నారంటే దీని ప్రత్యేకత ఏంటో అర్థం చేసుకోవచ్చు. ఈ మాసంలో ముస్లింలు ఉపవాసం ఉంటూ అల్లాను ప్రార్థిస్తారు. ఇఫ్తార్ సమయంలో పండ్లతో పాటు ఈ హలీం తినడం వల్ల వారికి రోజంతా కావాల్సిన శక్తి లభిస్తుంది. అలాగే గుమగుమలాడే దహీవడ, ఖర్జూరపండ్లు, సేమ్యా, ఇతరత్రా తినుబండారాలకూ విపరీతమైన డిమాండ్ ఉంటుంది. అలాగే జిల్లా కేంద్రంలోని ముస్లిం దుకాణాలు సందడి దర్శనమిస్తున్నాయి. వస్త్ర దుకాణాలు, ప్రత్యేక టోపీలు ఆకర్షణగా నిలుస్తున్నాయి. పండుగకు కావాల్సిన సరుకుల కొనుగోలులో ముస్లింలు నిమగ్నమయ్యారు.

- సిద్దిపేట అర్బన్, మార్చి 30


సిద్దిపేటలో హలీంను తింటున్న స్థానికులు


దహీవడ ఘుమఘుమలు


ప్రత్యేక టోపీలను కొనుగోలు చేస్తున్న చిన్నారులు


విద్యుత్ కాంతుల వెలుగులో సిద్దిపేటలోని మసీదు


కానుకలను లెక్కిస్తున్న మహిళా సభ్యులు

15 రోజులు.. రూ.61.89 లక్షలు

- మల్లన్న ఆలయంలో కానుకల లెక్కింపు

చేర్యాల, మార్చి 30 : కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయంలో శనివారం కానుకలు, ఒడిబియ్యం హుండీలను లెక్కించారు. దేవాదాయశాఖ మెదక్ జిల్లా ఇన్‌చార్జి అసిస్టెంట్ కమిషనర్ శివరాజ్ పర్యవేక్షణలో ఆలయ ఈవో బాలాజీశర్మ ఆధ్వర్యంలో ముఖమండపంలో లెక్కింపులు చేపట్టారు. రూ.61,89,123 నగదు, 75గ్రాముల బంగారం, 6.400కిలోల వెండి మిశ్రమం, 12 క్వింటాళ్ల ఒడిబియ్యం, 23 విదేశీ కరెన్సీ నోట్లు లభ్యమైనట్లు ఈవో బాలాజీశర్మ తెలిపారు. సత్యసాయి సేవాసమితికి చెందిన 250 మంది మహిళా సభ్యులు లెక్కించారు. బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్న నేపథ్యంలో 15 రోజుల్లోనే ఈ ఆదాయం సమకూరింది. లెక్కింపుల్లో ఆలయ పునరుద్ధరణ కమిటీ చైర్మన్ పర్పాటకం లక్ష్మారెడ్డి, ఏఈవో బుద్ధి శ్రీనివాస్, పునరుద్ధరణ కమిటీ సభ్యులు లింగంపల్లి శ్రీనివాస్, పొల్కు శ్రీనివాస్, బచ్చుల శ్రీనివాస్, కాయిత మోహన్‌రెడ్డి, అల్లం శ్రీనివాస్, ప్రధానార్చకుడు మహదేవుని మల్లికార్జున్, ఉద్యోగులు పాల్గొన్నారు.


హుండీలలో లభ్యమైన వెండి మొక్కుబడులు

ఉత్సాహంగా 'రన్ ఫర్ జీసస్'

మెదక్ కల్చరల్/సంగారెడ్డి అర్బన్, మార్చి 30 : మెదక్, సంగారెడ్డి పట్టణాల్లో శనివారం రన్ ఫర్ జీసస్ కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. ప్రఖ్యాతిగాంచిన మెదక్ సీఎస్ఐ చర్చి ప్రధాన ద్వారం నుంచి వందలాది ద్విచక్రవాహనాలతో మొదలై పట్టణంలోని ప్రధాన రహదారుల గుండా సాగింది. చర్చి కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రెసిబేటరీ ఇన్‌చార్జి శాంతయ్య దైవసందేశం అందించారు. శాంతి, స్నేహభావంతో కూడిన జీవనం కోసం జీసస్ చూపించి, ఆచరించిన మార్గాన్ని అనుసరించాలని బోధించారు. శాంతి కోసమే జీసస్ ఫర్ రన్ నిర్వహించామని తెలిపారు. యునైటెడ్ క్రిస్టియన్ యూత్ ఫోరమ్ ఆధ్వర్యంలో సంగారెడ్డి పట్టణంలో కొనసాగిన రన్ పాత బస్టాండ్ అంబేడ్కర్ విగ్రహం నుంచి పోతిరెడ్డిపల్లి మీదుగా సీఎస్ఐ చర్చి వరకు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. యునైటెడ్ క్రిస్టియన్ ఫోరమ్(యూసీఎఫ్), యునైటెడ్ క్రిస్టియన్ యూత్ ఫోరమ్‌ల(యూసీవైఎఫ్)అధ్యక్షులు రూబిన్‌రెడ్డి, ప్రవీణ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో టీఎస్ఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలారెడ్డి, టీపీసీసీ కార్యదర్శి తోపాజి అనంతకిషన్ పాల్గొని క్రైస్తవులకు ఈస్టర్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఫాదర్ ఇన్నారెడ్డి భక్తులకు దైవ సందేశం అందించారు.


మెదక్ పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు



రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ శనివారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ మనుచౌదరి, అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్, ఆర్డీవోలు పాల్గొన్నారు.

- సిద్దిపేట అగ్రికల్చర్

నీటిని విడుదల చేసి పంటలను కాపాడండి

- శాలిపేట గ్రామస్థులను కోరిన చెన్నాయిపల్లి రైతులు
- నీళ్లు ఇవ్వబోమని భీష్మించుక్కూర్చున్న శాలిపేటవాసులు
- పంటకు నిప్పు పెట్టడమే దిక్కని చెన్నాయిపల్లి రైతుల ఆవేదన
- నల్లచెరువు నుంచి నీటి విడుదలకు అధికారుల హామీ

7లో

పట్టుదలతో చదివితే అనుకున్నది సాధించవచ్చు

● సిద్దిపేట జడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ

సిద్దిపేట అర్బన్, మార్చి 30: విద్యార్థులు పట్టుదలతో చదివితే అనుకున్నది సాధించవచ్చు అని, చదువుతో పాటు ఆటపాటలలో ముందుండాలని సిద్దిపేట జడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ, ఎమ్మెల్సీ కూర రఘోత్తమ్‌రెడ్డి అన్నారు. శనివారం సిద్దిపేటలోని టీటీసీ భవన్‌లో కాకతీయ హైస్కూల్ వార్షికోత్సవంలో వారు మాట్లాడారు. సామాజిక మాధ్యమాల వైపు విద్యార్థులు మొగ్గు చూపకుండా చదువుపై ఆసక్తిని కనబరిచి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. క్రీడలతో విద్యార్థులకు మానసిక, శారీరక ధృఢత్వం లభిస్తుందని అన్నారు. అంతకుముందు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సమాజంలో స్త్రీల పట్ల జరుగుతున్న అన్యాయాలపై విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాన్ని చూసి అభినందించారు. వారికి బహుమతులను అందజేశారు. ఎమ్మెల్సీ, జడ్పీ చైర్‌పర్సన్‌ను కరస్పాండెంట్ జెగ్గ మల్లారెడ్డి సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

నవోదయ విద్యాలయంలో బ్యాగ్ లెస్ డే

వర్గల్, మార్చి 30: సిద్దిపేట జిల్లా వర్గల్ మండల కేంద్రంలోని జవహర్ నవోదయ విద్యాలయంలో బ్యాగ్‌లెస్ డే కార్యక్రమాలు ఉల్లాసంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా శనివారం విద్యాలయంలో విద్యార్థులు క్యాంపస్ శుభ్రత కార్యాక్రమాన్ని నిర్వహించారు. విద్యాలయ ప్రాంగణంలో ఉన్న చెత్తను, గార్డెన్‌లో పిచ్చి మొక్కలను తొలగించారు. హైదరాబాద్‌కు చెందిన సూక్ష్మ కళాకృతం కాళాకారుడు సూరం సంపత్‌కుమార్ విద్యార్థులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఆర్ట్‌కు సంబంధించిన విషయాలను తెలిజేశారు. 800 చాక్‌పీస్‌లో నిర్మింపజేసిన యాదాద్రి ఆలయం నమూనాను చూపించారు. చాక్‌పీస్‌లతో ఆంగ్ల అక్షరాలు ఎలా తయారు చేయాలో ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు నేర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజేందర్‌తో పాటు అధ్యాపక బృందం, సిబ్బంది పాల్గొన్నారు.

టీవీ, సోషల్ మీడియా చానళ్లలో తప్పుడు ప్రచారం

» 10 సంస్థలకు నోటీసులు పంపా: కేటీఆర్

హైదరాబాద్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): కొన్ని టీవీ చానళ్లతోపాటు, యూట్యూబ్, సోషల్ మీడియా సంస్థలకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ లీగల్ నోటీస్‌లు పంపించారు. ఇప్పటికే పలు చానళ్లకు లీగల్ నోటీస్‌లు పంపిన కేటీఆర్.. శనివారం మరో 10 సంస్థలకు లీగల్ నోటీస్‌లు పంపించారు. తనను, తన కుటుంబాన్ని బద్నాం చేయాలనే కుట్రలో భాగంగా అసత్య ప్రచారాలు, కట్టు కథలు అల్లుతున్నాయని, అందుకే ఆయా మీడియా సంస్థలకు నోటీసులు పంపినట్లు కేటీఆర్ వెల్లడించారు. మీడియా ముసుగులో అవన్నీ కుట్ర చేస్తున్నాయని ఆయన ఆరోపించారు. అయితే ఇప్పటికే కొన్ని మీడియా సంస్థలు తప్పు తెలుసుకుని వీడియోలు తీసివేసినట్లు తనకు సమాచారం అందించాయన్నారు. వారంలోగా మిగతా చానళ్లు కూడా తీసివేయాలని, లేదంటే వాటిపై చట్టప్రకారం ముందుకెళ్తామని శనివారం కేటీఆర్ ఒక ప్రకటనలో తెలిపారు.

కేసీఆర్ అవినీతిపై సమగ్ర విచారణ జరపాలి

» విదేశాలకు పారిపోకుండా పాస్‌పోర్టును సీజ్ చేయాలి

» హుస్నాబాద్ పోలీస్‌స్టేషన్‌లో జేఏసీ ఫిర్యాదు

హుస్నాబాద్, మార్చి 30: బీఆర్ఎస్ పది సంవత్సరాల పాలనలో మాజీ సీఎం కేసీఆర్ చేసిన అవినీతిపై సమగ్ర విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని శనివారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పోలీస్ స్టేషన్‌లో నియోజకవర్గ జేఏసీ నాయకులు ఫిర్యాదు చేశారు. అవినీతికి పాల్పడిన కేసీఆర్, మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, కవిత, సంతోష్‌రావు విదేశాలకు పారిపోకుండా వారి పాస్‌పోర్టులు సీజ్ చేయాలని కోరారు. కాళేశ్వరం ప్రాజెక్టు, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, సచివాలయనిర్మాణం, వరంగల్ జైలు కూల్చివేత, గొర్ల పంపిణీ, దళిత బంధు, ప్రైవేట్ విశ్వవిద్యాలయాలకు అనుమతులు, ధరణి పేరిట భూ కబ్జాలు తదితర అంశాలపై రూ.లక్షల కోట్ల అవినీతి జరిగిందని ఆరోపించారు.

ఏళ్లు గడిచినా గుర్తింపు లేదని..

» సీఎం నివాసం వద్ద కాంగ్రెస్ కార్యకర్త ఆత్మహత్యాయత్నం

బంజారాహిల్స్, మార్చి 30, (ఆంధ్రజ్యోతి): పార్టీలో చేరి సంవత్సరాలు గడుస్తున్నా తనకు తగిన ప్రాధాన్యం ఇవ్వడం లేదని ఓ కాంగ్రెస్ కార్యకర్త సీఎం నివాసం వద్ద ఆత్మహత్యాయత్నం చేశాడు. వరంగల్ జిల్లా భూపాలపల్లికి చెందిన కృష్ణ సాగర్ నగరంలోని రాజీవ్‌నగర్‌లో నివాసం ఉంటూ వ్యాపారం చేస్తున్నాడు. కాంగ్రెస్ కార్యకర్తగానూ వ్యవహరిస్తున్నాడు. జూబ్లీహిల్స్‌లోని సీఎం రేవంత్ రెడ్డి నివాసం వద్దకు శనివారం కారులో వచ్చాడు. సీఎంను కలిసేందుకు ప్రయత్నించగా భద్రతా సిబ్బంది వారించారు. దీంతో కృష్ణ సాగర్ తనతో తెచ్చుకున్న డీజిల్ పోసుకొని నిప్పు అంటించుకుంటానంటూ బెదిరించాడు. అక్కడే ఉన్న పోలీసులు స్పందించి జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కృష్ణసాగర్ మాట్లాడుతూ తాను సీఎం రేవంత్‌తోపాటు టీడీపీ నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చినట్టు చెప్పాడు. పార్టీలో ఏళ్లుగా పనిచేస్తున్నా గుర్తింపు లేదని ఆవేదన వ్యక్తం చేశాడు.

జూన్1 నుంచి ఇంటర్ కాలేజీల ప్రారంభం

హైదరాబాద్, మార్చి 30(ఆంధ్రజ్యోతి): వచ్చే విద్యాసంవత్సరానికి (2024-25) సంబంధించిన అకడెమిక్ క్యాలండర్‌ను ఇంటర్ బోర్డు శనివారం ప్రకటించింది. దీనిప్రకారం జూన్ 1 నుంచి కొత్త విద్యాసంవత్సరం తరగతులు ప్రారంభమవుతాయి. నవంబరు 18 నుంచి అర్ధ సంవత్సర పరీక్షలు, 2025 జనవరి 20 నుంచి ప్రీఫైనల్, ఫిబ్రవరి మొదటివారంలో ప్రాక్టికల్ పరీక్షలు, మార్చి మొదటివారంలో వార్షిక పరీక్షలు ఉంటాయని బోర్డు తెలిపింది.

పోలీస్ టు పొలిటికల్



(మొదటి పేజీ తరువాయి)

మలుపు తిరిగింది. "సాధారణంగా టాస్క్‌ఫోర్స్ బృందాలు, స్పెషల్ ఆపరేషన్ బృందాలు ఎన్నికల సమయంలో సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ బూత్‌లపై దృష్టిపెడతాయి. స్ట్రైకింగ్ ఫోర్స్, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ పేరుతో ఈ బృందాలు తమకు వచ్చిన సమాచారం మేరకు ఏ నియోజకవర్గంలోనైనా పర్యటిస్తాయి. అనుమానితులను సోదా చేస్తాయి. వీరి వాహనాలను ఇతర తనిఖీ బృందాలు అడ్డగించవు" అని ఓ విశ్రాంత పోలీసు అధికారి వివరించారు. దీన్ని బట్టి రాధాకిషన్‌రావు తమకు ఉన్న అధికారాలను, వెసులుబాట్లను దుర్వినియోగం చేసి, డబ్బు తరలించి ఉంటారని దర్యాప్తు అధికారులు అంచనాకు వచ్చారు. ఎవరి కోసం డబ్బు తరలించారు? ఎవరికి అందజేశారు? అనే ప్రశ్నలకు రాధాకిషన్‌రావు నోరు విప్పితే.. రాజకీయ నాయకుల పాత్ర బయటకు వస్తుందని తెలుస్తోంది. ప్రస్తుతం జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న రాధాకిషన్‌రావును కోర్టు అనుమతితో కస్టడీకి తీసుకుని, విచారించేందుకు పంజాగుట్ట పోలీసులు సిద్ధమవుతున్నారు. ట్యాపింగ్‌తోపాటు.. నగదు తరలింపు వెనక ఉన్న రాజకీయ శక్తులెవరనేది రాధాకిషన్ విచారణలో తేలుతుందని దర్యాప్తు అధికారులు భావిస్తున్నారు. రాధాకిషన్‌ను ఏయే అంశాలపై ప్రశ్నించాలి? అనే దానిపై ఉన్నతాధికారుల బృందం ఇప్పటికే ఓ ప్రశ్నావళిని సిద్ధం చేసినట్లు సమాచారం. "పోలీసు వాహనాల్లో డబ్బులు తరలించాలని ఆదేశించిన నాయకులెవరు? ఎన్నిసార్లు నగదును తరలించారు? ఎక్కడి నుంచి ఎక్కడికి చేరవేశారు? ఎవరికి అందజేశారు? ఆ నగదును ఎక్కడి నుంచి సర్దుబాటు చేశారు? ఈ కుట్రలో ఇంకా ఎవరెవరికి భాగస్వామ్యం ఉంది?" అనే ప్రశ్నలకు రాధాకిషన్ నుంచి సమాధానాలు రాబట్టేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది. ఈ ప్రశ్నలకు రాధాకిషన్‌రావు నోరు తెరిస్తే.. గత ప్రభుత్వ పెద్దలు, బీఆర్ఎస్ ముఖ్య నాయకులు అరెస్టయ్యే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. అంతేకాదు.. మనీలాండరింగ్ కోణం ఉండడంతో.. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) కూడా రంగంలోకి దిగే సూచనలున్నాయి. కాగా, ఈ కేసులో మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావుది తొలి అరెస్టు కాగా.. ఆయనను అదే రోజు సస్పెండ్ చేశారు. అదనపు ఎస్పీలు భుజంగరావు, తిరుపతన్న కూడా 48 గంటలకు మించి జైలులో ఉన్న నేపథ్యంలో నిబంధనల ప్రకారం వారిని సస్పెండ్ అయినట్లే.! అయితే.. సోమవారం అధికారికంగా సస్పెన్షన్ ఉత్తర్వులు వెలువడతాయని డీజీపీ కార్యాలయ వర్గాలు తెలిపాయి.

చంచల్‌గూడ జైలుపై నిరంతర నిఘా..!

ఫోన్ ట్యాపింగ్ సంచలన కేసు కావడంతో.. నిందితులు జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న చంచల్‌గూడ జైలుపై ఉన్నతాధికారులు నిఘా పెంచారు. ప్రస్తుతం భుజంగరావు, తిరుపతన్న పోలీసు కస్టడీలో ఉండగా.. ప్రణీత్‌రావు, రాధాకిషన్‌రావు జైలులో ఉన్న విషయం తెలిసిందే.! దీంతో వారి బ్యారెక్‌లు, కదలికలు, ములాఖత్‌కు వస్తున్నవారిపై ఉన్నతాధికారులు నిఘా పెంచారు. ఎస్ఐబీ నుంచి డీఎస్పీ స్థాయి నేతృత్వంలోని ఓ బృందం ఈ నిఘాను పర్యవేక్షిస్తోంది.

అదుపులో ముగ్గురు ఇన్‌స్పెక్టర్లు..?

ఈ కేసులో ఇప్పటి వరకు ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు, టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ(ఓఎ్‌స్‌డీ) రాధాకిషన్‌రావు, మాజీ అదనపు ఎస్పీలు భుజంగరావు, తిరుపతన్న, మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావు, ఐ న్యూస్ ఎండీ శ్రవణ్‌రావు నిందితులుగా ఉన్న విషయం తెలిసిందే! వీరితోపాటు.. ఐదుగురు ఇన్‌స్పెక్టర్లు కూడా పాత్రధారులేనని దర్యాప్తు అధికారులు భావిస్తున్నారు. ఈ ఐదుగురిలో ఇద్దరు ఇప్పటికే విచారణకు హాజరయ్యారు. తాజాగా.. మరో ముగ్గురు ఇన్‌స్పెక్టర్లను అదుపులోకి తీసుకుని, బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో విచారిస్తున్నట్లు తెలిసింది. వీరు గతంలో ఎస్ఐబీలో పనిచేశారా..? లేక టాస్క్‌ఫోర్స్‌లో రాధాకిషన్ టీమ్‌లో పనిచేశారా..? ఫోన్‌ట్యాపింగ్‌తో నేరుగా సంబంధం ఉందా? లేక రాధాకిషన్‌రావు ఆదేశాలతో వ్యాపారుల ప్రొఫైల్స్ తయారు చేసి, అక్రమ వసూళ్ల దందాకు పాల్పడ్డారా? అనే వివరాలు తెలియాల్సి ఉంది. మరోవైపు.. భుజంగరావు, తిరుపతన్న కింద పనిచేసిన సిబ్బందిపైనా అధికారులు ఆరా తీస్తున్నారు.

కామారెడ్డి మునిసిపాలిటీలో నెగ్గిన అవిశ్వాసం

» చైర్‌పర్సన్ పదవిని కోల్పోయిన జాహ్నవి

» వనపర్తిలో హైడ్రామా..

బీఆర్ఎస్‌కు 8 మంది రాజీనామా

కామారెడ్డి/మహబూబ్‌నగర్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కామారెడ్డి మునిసిపల్ కౌన్సిల్ పీఠాన్ని బీఆర్ఎస్ కోల్పోయింది. మునిసిపల్ చైర్‌పర్సన్ నిట్టు జాహ్నవిపై కాంగ్రెస్ కౌన్సిలర్లు ప్రతిపాదించిన అవిశ్వాస తీర్మానానికి 10 మంది బీఆర్ఎస్ కౌన్సిలర్లు కూడా మద్దతు తెలిపారు. దీంతో బీఆర్ఎస్ పార్టీ.. కామారెడ్డి మున్సిపాలిటీని కోల్పోవాల్సి వచ్చింది. కామారెడ్డి మునిసిపల్ చైర్‌పర్సన్‌పై ఈనెల 11 న కాంగ్రెస్ కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు. దీంతో అధికారులు శనివారం బలపరీక్ష సమావేశం నిర్వహించారు. కామారెడ్డి మున్సిపల్ కౌన్సిల్‌లో మొత్తం 49 మంది సభ్యులు ఉండగా.. అవిశ్వాసం నెగ్గడానికి 34 మంది సభ్యుల అవసరం ఉంది. అయితే, శనివారం జరిగిన బలపరీక్షకు కాంగ్రెస్ పార్టీకి చెందిన 27 మంది కౌన్సిలర్లు, బీఆర్ఎస్‌కు చెందిన 10 మంది కౌన్సిలర్లు హాజరై అవిశ్వాసానికి మద్దతు తెలిపారు. దీంతో కాంగ్రెస్ అవిశ్వాస తీర్మానం నెగ్గిందని అధికారులు ప్రకటించారు. కాగా, కాంగ్రెస్ కౌన్సిలర్లు తనపై అవిశ్వాస తీర్మానం చెల్లుబాటు కాదని పేర్కొంటూ చైర్‌పర్సన్ నిట్టు జాహ్నవి హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై ఈనెల 12న తీర్పు వెలువడే అవకాశం ఉందని పేర్కొన్నారు. మరోవైపు వనపర్తి మునిసిపాలిటీలో మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డికి షాక్ తగిలింది. కౌన్సిలర్లు ఎవరూ పార్టీని వీడొద్దన్న ఉద్దేశంతో చైర్మన్ గట్టు యాదవ్, వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్‌తో ఆయన రాజీనామా చేయించిన విషయం తెలిసిందే. అయితే, శనివారం 8 మంది కౌన్సిలర్లు బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి, కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు ప్రకటించారు. గత మునిసిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున ఐదుగురు సభ్యులు గెలువగా, ఆ తర్వాత బీజేపీ నుంచి ఇద్దరు, బీఆర్ఎస్ నుంచి ఇద్దరు ఆ పార్టీలో చేరారు. టీడీపీకి ఒక కౌన్సిలర్ ఉండగా ఆమె కూడా కాంగ్రెస్‌కే మద్దతు తెలుపుతున్నారు. తాజాగా 8 మంది కౌన్సిలర్ల రాజీనామాతో కాంగ్రెస్ బలం 18కి చేరనుంది. దీంతో మొత్తం 33మంది కౌన్సిలర్లున్న వనపర్తి మునిసిపల్ పీఠాన్ని కాంగ్రెస్ చేజిక్కించుకోవడం ఖాయంగా కనిపిస్తోంది.

కేకేకు బీఆర్ఎస్ ఏం అన్యాయం చేసింది?

» ఆయనకు రెండుసార్లు రాజ్యసభ.. కూతురికి మేయర్ పదవి ఇచ్చాం

» కష్టకాలంలో పార్టీని వీడడం దురదృష్టకరం

» కాంగ్రెస్ పాలనలో అందరికీ అన్యాయం

» ఆరు నెలల్లో అధికారం బీఆర్ఎస్‌దే: హరీశ్



గజ్వేల్, మార్చి 30: "బీఆర్ఎస్ కేశవరావు(కేకే)కు రెండుసార్లు రాజ్యసభ ఎంపీగా అవకాశమిచ్చింది. ఆయన కూతురికి మేయర్ పదవి.. కొడుక్కి కార్పొరేషన్ చైర్మన్ పదవులు కూడా ఇచ్చింది. పార్టీలో పెద్ద మనిషిగా కేకేకు కేసీఆర్ ఎప్పుడూ గౌరవం ఇచ్చే వారు. కేసీఆర్ ఆయనకు ఏం అన్యాయం చేశారు? కష్టకాలంలో పార్టీని వదిలిపోవడం దురదృష్టకరం" అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రశ్నించారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ అసెంబ్లీ నియోజకవర్గ బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం శనివారం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా శామీర్‌పేటలోని ఓ గెస్ట్‌హౌజ్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. పార్టీ కష్టకాలంలో ఉండగా విడిచి పెట్టి వెళ్లిన వాళ్లను తర్వాత కాళ్లు మొక్కినా తీసుకోబోమని చెప్పారు. తమకు నష్టం చేసిన వారిని విడిచి పెట్టేది లేదని, లెక్కలు రాస్తున్నామని, తర్వాత వడ్డీతో సహా తీర్చుకుంటామన్నారు. రాష్ట్రంలో వంద రోజుల కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు ఆగమయ్యారని, కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నీటి బుడగలు అని, ఉద్దెర పథకాలు మొదలు పెట్టారని ఎద్దేవా చేశారు. మళ్లా బోర్లు వేసే కాలం వచ్చిందని, మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నాయని, ఆరు నెలలు ఓపిక పడితే భవిష్యత్తు బీఆర్ఎస్‌దేనని, మళ్లీ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని చెప్పారు. గజ్వేల్ అభివృద్ధిని ఓర్వలేని బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌కు ఎందుకు ఓట్లు వేయాలని ప్రశ్నించారు. గజ్వేల్ అభివృద్ధిని అడ్డుకునే ప్రయత్నం చేసిన రఘునందన్ గురుంచి గ్రామాల్లో చర్చ పెట్టాలని హరీశ్‌రావు సూచించారు.

అందరికీ పనులు చేశా

తాను మంత్రిగా ఉన్నప్పుడు అందరికీ అన్ని పనులు చేశానని, సమయాభావం వల్ల కడుపు నిండా మాట్లాడలేకపోయానని, ఇక నుంచి నా ప్రాణం అడ్డం పెట్టి అయినా కార్యకర్తల వెంట ఉంటానని హరీశ్‌రావు అన్నారు. ఏప్రిల్ 2న పూర్తిస్థాయిలో కార్యకర్తల సమావేశం నిర్వహించి మాట్లాడుకుందామని చెప్పారు.

బీఆర్ఎస్ మునిగిపోయే నావ

● మెదక్ బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు

నర్సాపూర్/శివ్వంపేట/కొల్చారం, మార్చి 30: బీఆర్ఎస్ మునిగిపోయే నావ అని, అబద్ధాలు చెప్పడంలో కేసీఆర్, మోసం చేయడంలో హరీశ్‌రావు దిట్ట అని మెదక్ పార్లమెంటు బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు విమర్శించారు. శనివారం నర్సాపూర్, శివ్వంపేట మండలం చండి, కొల్చారం మండలం పోతంశెట్‌పల్లి, హత్నూర మండలం దౌల్తాబాద్‌లో నిర్వహించిన కార్యకర్తల సమావేశాల్లో రఘునందన్‌రావు మాట్లాడారు. కేసీఆర్ ఇలాకా అయిన మెదక్ నుంచి బీఆర్ఎస్ తరఫున బరిలో నిలిచే స్థానిక ఉద్యమ నాయకులు పనికిరారా అని ప్రశ్నించారు. డబ్బులున్నాయన్న ఉద్దేశంతో ఇతర ప్రాంతానికి చెందిన మాజీ అధికారిని బరిలో దించారని ఆరోపించారు. ఉద్యమ నాయకులకు బీఆర్ఎస్ తీవ్ర అన్యాయం చేసి, ఉద్యమ ద్రోహులను అందలం ఎక్కించడం వల్లనే ఆ పార్టీకి గడ్డు పరిస్థితి వచ్చిందన్నారు. కాంగ్రెస్ పార్టీకి అభ్యర్థులకు కరువై మూడు పార్టీలు మారిన వ్యక్తికి టికెట్ ఇచ్చారని ఎద్దేవా చేశారు. ఎత్తిన కాషాయజెండాను దించకుండా పార్టీని నడపాల్సింది బూత్ కమిటీ అధ్యక్షులేనన్నారు. నిరంతరం ప్రజా సేవలో ఉండే తనకు మెదక్ ఎంపీగా అవకాశమిస్తే మెదక్ పార్లమెంటును అన్ని విధాల అభివృద్ధి చేయడమే కాకుండా దేశంలోనే ఈ ప్రాంతానికి ప్రత్యేక పేరు వచ్చేలా కృషి చేస్తానన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం గొప్పలు చెప్పి ఇప్పుడు కాలయాపన చేస్తూ ప్రజలను మభ్యపెడుతుందన్నారు. నర్సాపూర్ మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి మట్టి, ఇసుక దందా కోసమే కాంగ్రెస్ పార్టీలోకి పోతున్నడని ఆరోపించారు. సమావేశాల్లో పార్టీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మురళీధర్‌యాదవ్, ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్నరమేష్‌గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి గోడ రాజేందర్, మాజీ ఎంపీపీ రమణారావు, కౌన్సిలర్లు సురేష్, బుచ్చేస్‌యాదవ్, యాదగిరి, పార్టీ పట్టణ అధ్యక్షుడు అంజిగౌడ్, నాయకులు కొత్తశ్రీనివాస్, నాగరాజు, నగేష్, శంకర్, చంద్రయ్య, ఉమాశ్రీ, కవిత, కౌడిపల్లి మండలాధ్యక్షుడు రవి, మండల నాయకులు రాజేందర్, రమణారావు, సామల యాదగిరి, వాల్దాస్ మల్లేష్‌గౌడ్, అంజనేయిలు గౌడ్, మాణయ్య యాదవ్, దుర్గయ్య, హరీష్, కొల్చారం, కౌడిపల్లి మండలాల అధ్యక్షులు దయాకర్‌గౌడ్, ఖాజీపేట రాకేష్ పాల్గొన్నారు.



పోతంశెట్‌పల్లిలో మాట్లాడుతున్న రఘునందన్‌రావు

హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ విఫలం

● బీబీపాటిల్‌కు నీతి, నిజాయితీ, నిబద్ధత లేవు

● శాసనసభ మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి

నారాయణఖేడ్, మార్చి 30: కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీలు, ఆరు వారంటీలుగా మిగిలిపోయాయని శాసనసభ మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి విమర్శించారు. శనివారం సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్‌లో మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన బీఆర్ఎస్ పార్లమెంట్ ఎన్నికల నియోజకవర్గ స్థాయి సన్నాహక సమావేశంలో పోచారం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడారు. ఆరు గ్యారంటీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. బీఆర్ఎస్ హయాంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించి రాష్ట్రంలో 12ఎంపీ స్థానాల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని కార్యకర్తలకు సూచించారు. జహీరాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ గెలుపుకోసం పని చేయాలన్నారు. జహీరాబాద్ ఎంపీ బీబీపాటిల్‌కు నీతి, నిజాయితీ, నిబద్ధత లేకుండా వ్యవహరించారని, ఆయనకు దిమ్మతిరగాలంటే బీఆర్ఎస్ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. జహీరాబాద్ ఎంపీలుగా పదేళ్లు బీబీపాటిల్, ఐదేళ్లు సురేష్‌షెట్కార్ ఉన్నా నియోజకవర్గ అభివృద్ధికి ఎలాంటి కృషి చేయలేదన్నారు. కేంద్ర ప్రభుత్వ అవినీతిని ప్రశ్నిస్తే ఈడీ బేడీలతో రాజకీయం చేస్తూ కేజ్రీవాల్, కవితలను అరెస్టు చేయించారని పోచారం విమర్శించారు. జహీరాబాద్ ఎంపీ బీబీపాటిల్ తన ఆస్తులను కాపాడుకోవడానికే బీఆర్ఎస్ పార్టీకి ద్రోహం చేసి బీజేపీలో చేరారని మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్, జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు, జడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీజైపాల్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు సాయికుమార్, వేణుగోపాల్‌గౌడ్, డీసీసీబీ డైరెక్టర్ వెంకట్‌రాములు, మోయిద్ ఖాన్, మండలాధ్యక్షులు పరమేశ్వర్, శ్రేయారెడ్డి, జైపాల్‌రెడ్డి, సత్యపాల్ రెడ్డి, గీతారెడ్డి, జడ్పీటీసీ లక్ష్మిబాయిరవీందర్‌నాయక్ పాల్గొన్నారు.



ఖేడ్‌లో మాట్లాడుతున్న పోచారం శ్రీనివాస్‌రెడ్డి

నీటిని విడుదల చేసి పంటలను కాపాడండి

● శాలిపేట గ్రామస్థులను కోరిన చెన్నాయిపల్లి రైతులు

● నీళ్లు ఇవ్వబోమని భీష్మించుకున్న శాలిపేటవాసులు

● నల్లచెరువు నుంచి నీటి విడుదలకు కృషి చేస్తామని అధికారుల హామీ

చిన్నశంకరంపేట, మార్చి 30: మెదక్ జిల్లా చిన్నశంకరంపేట మండలంలోని చెన్నాయిపల్లి గ్రామంలో రైతులు సాగు చేసిన వరి పంటలు కోత దశకు చేరగా.. ప్రస్తుతం నీళ్లందక ఎండిపోతున్నాయి. బోరుబావుల్లో నీరు అడుగంటిపోవడంతో పంట పొలాలకు నీళ్లు అందడం లేదు. చెన్నాయిపల్లి రైతులు శాలిపేట గ్రామస్థులను నల్లచెరువు నుంచి నీటిని విడుదల చేసేందుకు సహకరించాలని కోరితే నిరాకరిస్తున్నారు. దీంతో రైతుల గోస పట్టించుకొని శాలిపేట నల్లచెరువు నుంచి విడుదల చేయాలని చెన్నాయిపల్లి రైతులు అధికారులకు విన్నవించారు. స్పందించిన ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు పంటలకు నీరు అందించేందుకు స్థానిక అధికారులతో శనివారం సమీక్ష నిర్వహించారు. అనంతరం చెన్నాయిపల్లి గ్రామాన్ని సందర్శించిన ఇరిగేషన్ ఈఈ శ్రీనివాస్‌రావు, తహసీల్దార్ మన్నన్, ఎస్ఐ నారాయణగౌడ్, ఇరిగేషన్ ఏఈ ప్రతీప్‌రెడ్డి, ఆర్ఐ గోవింద్ ఎండిన వరి పంటలను పరిశీలించారు. చేతికందే పంటలు ఎండిపోతున్నాయని చలించిన అధికారులు శాలిపేట నల్లచెరువును సందర్శించారు. ఆ గ్రామస్థులను పిలిపించి చెన్నాయిపల్లికి తూము నుంచి నీటిని విడుదల చేయాలని సూచించడంతో శాలిపేటవాసులు నీళ్లను వదిలేది లేదని భీష్మించుక్కూర్చున్నారు. అధికారులు నచ్చజెప్పినా వినలేదు. నల్లచెరువు 30 సంవత్సరాల నుంచి నిండలేదని అప్పుడు చెన్నాయిపల్లి గ్రామస్థులు శాలిపేటకు సహరించలేదన్నారు. ఈసారి చెరువు నిండడంతో చెన్నాయిపల్లి గ్రామస్థులు కుంటిసాకులతో వస్తున్నారని మండిపడ్డారు. ఏదేమైనా నీళ్లను వదిలే ప్రసక్తిలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో చేసేదేమీలేక అధికారులు అక్కడి నుంచి చెన్నాయిపల్లికి చేరుకున్నారు. అక్కడి రైతులు నీళ్లను వదిలే వరకు ఇక్కడి నుంచి కదిలేది లేదని లేకుంటే పంటలకు నిప్పు పెడుతామని ఆవేదన వ్యక్తం చేస్తూ వాహనాలను అడ్డుకునే యత్నం చేశారు. దీంతో అధికారులతో కొద్దిసేపు వాగ్వాదం జరిగింది. నీటి విడుదలకు కృషి చేస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో శాంతించారు.



శాలిపేట నల్లచెరువు వద్ద ఇరు గ్రామస్థులను సమన్వయపరుస్తున్న అధికారులు

రఘునందన్‌రావుపై చర్యలు తీసుకోండి

● ఎలక్షన్ కమిషన్‌కు సంగారెడ్డి ఎమ్మెల్యే ప్రభాకర్ ఫిర్యాదు

సంగారెడ్డి రూరల్, మార్చి 30: ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించిన మెదక్ బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావుపై చర్యలు తీసుకోవాలని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు హైదరాబాద్‌లో రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్‌కు శనివారం ఫిర్యాదు చేశారు. మాజీ మంత్రి హరీశ్‌రావు, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, మెదక్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామారెడ్డిలను పరుష పదజాలంతో రఘునందన్‌రావు దూషించారని ఆరోపించారు. ఈ మేరకు రఘుందన్‌రావుపై చర్యలు తీసుకోవాలని కోరారు.

చెక్‌పోస్ట్ వద్ద రూ.80వేల నగదు పట్టివేత

జగదేవ్‌పూర్, మార్చి 30: సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్ వద్ద శనివారం పోలీసులు రూ.80 వేల నగదును పట్టుకున్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎస్ఐ చంద్రమోహన్ ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేస్తుండగా.. జగదేవ్‌పూర్‌లో వేసిన తాడిపత్రిలకు సంబంధించిన డబ్బు వసూలుకు హైదరాబాద్‌కు చెందిన అమర్‌రామ్ భువనగిరి నుంచి వ్యాన్‌లో వెళ్తున్నాడు. వాహనంలో ఎలాంటి ఆధారాలు లేకుండా రూ.80 వేల నగదు లభించడంతో పోలీసులు సీజ్ చేశారు. ఎస్ఐ చంద్రమోహన్ మాట్లాడుతూ.. సీజ్ చేసిన డబ్బులను కలెక్టర్ కార్యాలయంలో గ్రీవెన్స్ కమిటీకి అప్పగిస్తామని, బాధితులు అక్కడికి వెళ్లి అధికారులకు సరైన పత్రాలను చూపించి డబ్బు తీసుకెళ్లొచ్చని చెప్పారు.

కంటైనర్ ఢీకొని ఒకరి దుర్మరణం



ప్రమాదానికి కారణమైన కంటైనర్



రాములు (ఫైల్)

పుల్‌కల్, మార్చి 30: కంటైనర్ ఢీకొని ఒకరి మృతిచెందిన సంఘటన సంగారెడ్డి జిల్లా చౌటకూర్ మండలం శివంపేట గ్రామంలో శనివారం చోటు చేసుకున్నది. పుల్‌కల్ ఎస్ఐ క్రాంతి‌కాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. శివంపేట గ్రామానికి చెందిన మిరియాల రాములు(65) వరి పొలానికి నీళ్లు పారబెట్టేందుకని చక్రియాల వైపు వెళ్తూ రోడ్డు దాటుతుండగా.. సంగారెడ్డి వైపు నుంచి జోగిపేట వైపునకు వెళ్తున్న కంటైనర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తలకు బలమైన గాయాలై రాములు అక్కడికక్కడే మృతి చెందాడు. కాగా రాములును రక్షించేందుకు డ్రైవర్ సడన్ బ్రేక్ వేయడంతో కంటైనర్ రహదారికి పక్కన అమర్చిన మెటల్‌బీమ్ బారియర్‌ను బలంగా ఢీకొట్టి సర్వీసు రోడ్డువైపు దూసుకెళ్లింది. దీంతో మెటల్‌బీమ్ బారియర్ సైతం ధ్వంసమయింది. కంటైనర్ డ్రైవర్, క్లీనర్ అక్కడి నుంచి పరారైనట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. రహదారిపై నిలిచిపోయిన కంటైనర్‌ను పోలీసులు, ఎన్‌హెచ్ఏఐ రెస్క్యూ సిబ్బంది పక్కకు తొలగించి రాకపోకలను క్రమబద్ధీకరించారు. కాగా, ఎన్నికల ప్రచార నిమిత్తం అటుగా వెళ్తున్న జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

కారు బోల్తాపడి యువకుడు..





సుల్తాన్‌పూర్‌లో బోల్తాపడిన కారు, ప్రమాదంలో గాయపడిన మెరాజ్

పుల్‌కల్, మార్చి 30: సంగారెడ్డి జిల్లా చౌటకూర్ మండలం సుల్తాన్‌పూర్ గ్రామ శివారులో సంగారెడ్డి-నాందేడ్, అకోలా 161 జాతీయ రహదారిపై శనివారం కారు బోల్తాపడి ఒకరు మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. పుల్కల్ ఎస్ఐ క్రాంతి‌కాంత్ తెలిపిన వివరాల ప్రకారం... ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన షారూఖ్ మాలిక్(30), ఢిల్లీకి చెందిన మెరాజ్(43) స్నేహితులు. వీరు హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్ ప్రాంతంలోని చింతల్‌మెట్‌లో నివాసముంటూ దుస్తుల వ్యాపారం చేస్తున్నారు. వ్యాపార నిమిత్తం హైదరాబాద్ నుంచి కారులో జోగిపేట వైపు వెళ్తున్నారు. సుల్తాన్‌పూర్ గ్రామ సమీపంలోకి వెళ్లగానే కారు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో షారూఖ్ మాలిక్ అక్కడికక్కడే మృతి చెందగా, మెరాజ్ తీవ్రంగా గాయపడ్డాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సంగారెడ్డిలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వైభవంగా ధ్వజారోహణం



ధ్వజారోహణం నిర్వహిస్తున్న వేద పండితులు

వర్గల్, మార్చి 30: సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారికి ధ్వజారోహణ నిర్వహించారు. ఆలయంలో ఉదయం నీరాజనం, హోమం, దేవతాహ్వానం, బేరిపూజ, మంత్రపుష్పంతో పాటు తదితర పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. పూజల అనంతరం ఆలయ ప్రాంగణంలో ధ్వజస్తంభం వద్ద స్వామివారి ధ్వజారోహణ కార్యక్రమం చేశారు. వేడుకలను తిలకించడానికి భక్తులు క్షేత్రానికి అధికంగా తరలివచ్చారు. ఈవో కట్ట అన్నపూర్ణ పర్యవేక్షణలో ఉత్సవాలు జరుగుతున్నాయి. భక్తుల సౌకర్యార్థం ఆలయం వద్ద ఏర్పాట్లు ఘనంగా చేసినట్లు తెలిపారు. ఆదివారం రాత్రి 10.00 గంటలకు స్వామివారి తిరు కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు అన్నపూర్ణ తెలిపారు.

ప్రతి ఒక్కరూ భక్తి భావాన్ని కలిగి ఉండాలి

● ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి



కాసులాబాద్ పెద్దమ్మ ఆలయంలో ఎమ్మెల్యేను సన్మానిస్తున్న కమిటీ సభ్యులు



జగదేవ్‌పూర్‌లోని పీర్లపల్లిలో ధ్వజస్తంభానికి పూజలు చేస్తున్న దృశ్యం

మిరుదొడ్డి, మార్చి 30: ప్రతి ఒక్కరూ భక్తి భావాన్ని కలిగి ఉండాలని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శనివారం మిరుదొడ్డి మండలం కాసులాబాద్ గ్రామంలో శ్రీపెద్దమ్మ దేవాలయ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఆలయంలో శ్రీపెద్దమ్మ పెద్దిరాజుల కల్యాణ మహోత్సవంలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు మనోహర్‌రావు, నాయకులు తుమ్మల బాల్‌రాజు, శ్రీనివాస్, అంజిరెడ్డి, సత్యనారాయణ, లింగం, బిక్షపతి, హైమ్మద్, నర్సింహ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ

జగదేవ్‌పూర్, మార్చి 30: మండలంలోని పీర్లపల్లి గ్రామంలో శ్రీ మల్లికార్జునస్వామి, రేణుక ఎల్లమ్మ ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠను వైభవంగా నిర్వహించారు. డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి ఈ కార్యక్రమానికి హాజరై స్వామివారిని, ఎల్లమ్మతల్లిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ దైవభక్తిని అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ యాదవరెడ్డి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, యాదవ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

నేడు రామాలయంలో ప్రథమ వార్షికోత్సవం

గజ్వేల్‌టౌన్, మార్చి 30: గజ్వేల్ పట్టణంలోని రామాలయంలో ప్రథమ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం జరగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వందల సంవత్సరాలు చరిత్ర ఉన్న ఈ పురాతన సీతారామ ఉమామహేశ్వర దేవాలయాన్ని గత సంవత్సరం పునప్రతిష్ఠించారు. ఆదివారం శ్రీ సీతారామ ఉమామహేశ్వరస్వామి దేవాలయంలో ప్రథమ వార్షిక ఉత్సవం జరుగుతుందని, ఉదయం 9 గంటలకు విఘ్నేశ్వరస్వామి దేవాలయంలో విఘ్నేశ్వర పూజ, వరుణమంటన, ఆరాధనం, దేవతా ఆహ్వానం, సీతారామచంద్ర స్వామికి పురుషసూక్త అభిషేకం, ఉమామహేశ్వర స్వామికి రుద్రాభిషేకం కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. మధ్యాహ్నం 12:30కు మహా మంగళహారతి మంత్ర పుష్పం తీర్థప్రసాద వితరణ నిర్వహిస్తామని నిర్వహకులు తెలిపారు.

చెప్పులు వేసుకోకుండా తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న యువకుడు అనారోగ్యంతో మృతి



కరుణాకర్(ఫైల్)

రాయపోల్, మార్చి 30: చెప్పులు వేసుకోకుండా తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న యువకుడు మృతి చెందాడు. సిద్దిపేట జిల్లా రాయపోల్ మండల కేంద్రానికి చెందిన ఇప్ప కరుణాకర్(35) తెలంగాణ వచ్చే వరకు చెప్పులు వేసుకోనని శపథం చేసి ఐదేళ్ల పాటు చెప్పులు లేకుండా ఉద్యమంలో పాల్గొన్నాడు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న అతడు శనివారం మృతి చెందాడు. పేద కుటుంబం కావడంతో చందాలు వేసి అంత్యక్రియలు చేశారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి



పోచమ్మ (ఫైల్)

ములుగు, మార్చి 30: ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఓ మహిళ మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని అచ్చాయపల్లికి చెందిన తప్పెట్ల పోచమ్మ(50) గురువారం గ్రామం నుంచి డబుల్ బెడ్‌రూం ఇళ్ల వైపు వెళ్తూ అదే గ్రామానికి చెందిన ఒక వ్యక్తి ద్విచక్ర వాహనం ఎక్కింది. మార్గమధ్యంలో బండిపై నుంచి జారి పడింది. చికిత్స కోసం లక్ష్మక్కపల్లిలోని ఓ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు సూచన మేరకు గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి 10:30 మృతి చెందింది. మృతురాలి కుమారుడు కార్తీక్ ఫిర్యాదు మేరకు ద్విచక్ర వాహనం నడిపిన వ్యక్తిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తాళం వేసి ఉన్న ఐదు ఇళ్లల్లో చోరీ

● బంగారం, వెండి ఆభరణాలు, నగదు అపహరణ

మిరుదొడ్డి, మార్చి 30: తాళం వేసి ఉన్న ఐదు ఇళ్లల్లో చోరీ జరిగిన సంఘటన శనివారం తెల్లవారుజామున సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండలం అల్వాల్ గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామంలోని గాదే నర్సింహులు ఇంటిలో పుస్తె, ఆరుతులాల వెండి, కేశవచారి ఇంటిలో 3తులాల బంగారం, రూ.30వేల నగదు, భాస్కరచారి ఇంటిలో రెండు బంగారు విగ్రహాలు, రూ.8వేల నగదు, నీరటి వెంకయ్య ఇంటిలో కిలో వెండి, రూ.50వేల నగదును ఎత్తుకెళ్లారు. శ్రీనివాస్ ఇంటిలోనూ చోరీ చేశారు. ఉదయం ఇళ్లకు వచ్చిన బాధితులు చోరీ జరిగినట్లు గుర్తించి స్థానిక ఎస్ఐ పరశురాములుకు సమాచారం అందించారు. ఆయన సిబ్బందితో కలిసి ఆయా ఇళ్లను పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలి

● కలెక్టర్‌కు ఎస్ఎఫ్ఐ నాయకుల వినతి

సిద్దిపేట అర్బన్, మార్చి 30: పదోతరగతి విద్యార్థుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి ప్రశాంత్ కోరారు. శనివారం సిద్దిపేట కలెక్టర్ మను చౌదరికి ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా దాసరి ప్రశాంత్ మాట్లాడుతూ.. అమ్మాయిలతో అసభ్యకరంగా ప్రవర్తించిన ప్రభుత్వ టీచర్లపై చర్యలు తీసుకోవాలని గతంలో కూడా ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని అన్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు రెడ్డమైన అరవింద్, కొండం సంజీవ్‌కుమార్, ఆముదాల రంజిత్‌రెడ్డి, శేఖర్ పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ మహేందర్‌రెడ్డి

వర్గల్, మార్చి 30 : మండలంలోని గౌరారం గ్రామం రాజీవ్ రహదారి పాములపర్తి క్రాస్ రోడ్డు వద్ద గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు యువకులను శనివారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి గంజాయిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మర్కూక్ మండల కేంద్రానికి చెందిన మొర్సు విఘ్నేందర్ (20), అదే మండలం పాములపర్తి గ్రామానికి చెందిన పిట్ల రాజు (20) అనే ఇద్దరు, రాజీవ్ రహదారి పాములపర్తి క్రాస్ రోడ్డు వద్ద గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం అందింది. దీంతో గౌరారం ఎస్ఐ శివకుమార్ సిబ్బందితో వెళ్లి వారిని తనిఖీ చేయగా వారి వద్ద ఉన్న బ్యాగ్‌లో 60 గ్రాముల గంజాయి ప్యాకెట్‌ను స్వాధీనం చేసుకున్నారు. వీరు కొంత కాలంగా హైదరాబాద్ చెందిన ఉమేశ్‌సింగ్ వద్ద గంజాయిని కొనుగోలు చేసి, వారు వినియోగిస్తూ, మిగిలిన దానిని చుట్టు పక్కల గ్రామాలలోని యువకులకు విక్రయిస్తున్నారని తెలిపారు. గంజాయితో పాటు రెండు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు పంపించినట్లు సీఐ వెల్లడించారు.

రఘునందన్‌రావును విమర్శించే హక్కు లేదు

● బీజేపీ కౌన్సిలర్ మట్ట మల్లారెడ్డి

దుబ్బాక, మార్చి 30: మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావును విమర్శించే హక్కు దుబ్బాక ఎమ్మెల్యే కొత్తప్రభాకర్‌రెడ్డికి లేదని బీజేపీ దుబ్బాక కౌన్సిలర్ మట్ట మల్లారెడ్డి విమర్శించారు. శనివారం దుబ్బాకలో బీజేపీ నాయకులతో కలిసి మాట్లాడారు. దుబ్బాకలో గెలిచిన తర్వాత ఎమ్మెల్యే ఎప్పుడూ దుబ్బాకకు వచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. గతంలో ఎంపీగా గెలిచిన మీరు దుబ్బాకకు చేసిందేమి లేదన్నారు. సామాన్య ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషిచేయాలన్నారు. ఆయనవెంట బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు శివప్రసాద్, మున్సిపాలిటీ అధ్యక్షుడు సుభాష్‌రెడ్డి, నాయకులు కిషన్, ప్రవీన్, భాస్కర్, శ్రీకాంత్, నేహల్, సప్తగిరి, శ్రీనివాస్, బాచి ఉన్నారు.

రైతులకు నాణ్యమైన విత్తనాలను అందించాలి

● జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్

ములుగు, మార్చి 30: రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు సక్రమంగా అందించాలని జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్ అన్నారు. శనివారం ములుగు మండలం సింగన్నగూడ, వంటిమామిడి, ములుగు గ్రామంలో ఫర్టిలైజర్ షాపులను తనిఖీ చేశారు. ఈ సందర్భగా యన మాట్లాడుతూ.. రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందించాలని సూచించారు. రైతులకు ఎరువులను ఎక్కువ ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. షాపుల్లో రికార్డులు సక్రమంగా ఉంచుకోవాలన్నారు. రోజువారి అమ్మకాలను రికార్డులో రాసి పెట్టుకోవాలన్నారు. ఆయన వెంట ఏవో ప్రగతి, ఏఈవో పృథ్వీరాజ్‌తో పాటు తదితరులున్నారు.

హ్యాండ్‌బాల్ పోటీలకు రిఫరీగా ప్రేమ్‌కుమార్

మద్దూరు, మార్చి 30: మద్దూరు మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో పీటీగా పనిచేస్తున్న దామెర ప్రేమ్‌కుమార్ జాతీయ సీనియర్ హ్యాండ్ బాల్ పోటీలకు రిఫరీగా ఎంపికయ్యాడు. హ్యాండ్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈ నెల 31 నుంచి ఏప్రిల్ 5 వరకు బీహార్ రాష్ట్రంలో నిర్వహించనున్న సీనియర్ పురుషుల జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో రిఫరీగా పాల్గొనునున్నట్లు హ్యాండ్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాయింట్ సెక్రటరీ, తెలంగాణ రాష్ట్ర హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్యామల పవన్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా అభినందించిన వారిలో కందుకూరి ఉపేందర్, దామెర మల్లేశం అసోసియేషన్ ప్రతినిధులు ఉన్నారు

వైస్ ఎంపీపీ పై వీగిన అవిశ్వాసం

కొండపాక, మార్చి 30 : మండల వైస్ ఎంపీపీ దేవి రవీందర్‌పై పెట్టిన అవిశ్వాస తీర్మానం వీగి పోయింది. కొన్ని రోజుల క్రితం వైస్ ఎంపీపీపై అవిశ్వాసం ప్రకటిస్తూ తొమ్మిదిమంది ఎంపీటీసీ సభ్యులు ఆర్డీవోకు అవిశ్వాస తీర్మాన పత్రాన్ని అందజేశారు. దాంతో అధికారులు అవిశ్వాస తీర్మానంపై శనివారం సమావేశం ఏర్పాటు చేశారు. అవిశ్వాసం నెగ్గడానికి సమావేశానికి తొమ్మిది మంది సభ్యులు అవసరం ఉండగా ఎనిమిది మంది సభ్యులు మాత్రమే హాజరయ్యారు. దాంతో అవిశ్వాసం వీగి పోయిందని ఆర్డీవో బన్సిలాల్ వెల్లడించారు.

పాఠశాల గేటు తాళాన్ని తొలగించిన అధికారులు

చేర్యాల, మార్చి 30: ఆస్తిపన్ను బకాయిలో రూ.3.18 లక్షల నగదు చెల్లించడంతో పట్టణంలోని శ్రీ చైతన్య పాఠశాల గేటుకు వేసిన తాళాన్ని తొలగించినట్లు శనివారం మునిసిపల్ కమిషనర్ నర్సయ్య తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాలుగేళ్లుగా సుమారు రూ.4 లక్షలకు పైగా బకాయి చెల్లించలేదని, ఆర్థిక సంవత్సరం ముగియనున్నందున చేపట్టిన స్పెషల్ డ్రైవ్‌లో పాఠశాలకు తాళం వేశామన్నారు. పాఠశాల, భవన నిర్వహకులు రూ.3.18లక్షలు పన్ను చెల్లించడంతో వేసిన తాళం తొలగించామన్నారు.

బీజేపీ మండల కార్యవర్గం ఏర్పాటు

కొండపాక, మార్చి 30 : బీజేపీ కొండపాక మండల పూర్తి కార్యవర్గాన్ని ఏర్పాటు చేసినట్టు మండల అధ్యక్షుడు నీల సత్యం తెలిపాడు. మండల ఉపాధ్యక్షులుగా శ్రీకాంత్, నరేందర్, మల్లేశం శ్రీనివాస్, బాలకిషన్, సురేందర్ ప్రధాన కార్యదర్శులుగా మల్లేశం, ప్రశాంత్, నరేందర్‌రెడ్డి, కార్యదర్శులుగా రమేష్, సురేష్, నర్సిహ్మారెడ్డి, మోర్చా అధ్యక్షుడిగా ప్రవీణ్, కిసాన్ మోర్చా అధ్యక్షుడిగా స్వామి, ఎస్సీ మోర్చా అధ్యక్షుడిగా శ్రీనివాస్, ఓబీసీ మోర్చా అధ్యక్షుడిగా పండరి, సోషల్ మీడియా అధ్యక్షుడిగా ఆంజనేయులు నియామకం అయినట్టు తెలిపాడు.

దుబ్బాకలో రజకుల నిరసన

దుబ్బాక, మార్చి30: దుబ్బాకలో నిర్వహించిన బీఆర్ఎస్ సన్నాహక సమావేశంలో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి చేసిన వాఖ్యలను వెనక్కి తీసుకోవాలని రజక సంఘం సభ్యులు రవీందర్ డిమాండ్ చేశారు. శనివారం దుబ్బాకలో రజకసంఘం నాయకులతో మాట్లాడారు. రజకులపై చేసిన వాఖ్యలను ఎమ్మెల్యే కొత్తప్రభాకర్‌రెడ్డి ఉపసంహరించుకోవాలన్నారు. వెంటనే పత్రిక ముఖంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రజకులతో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలను చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో రజకసంఘం నాయకులు నర్సింలు, రాజు, బాబు, కాశీ, మహేందర్ ఉన్నారు.

పాత ఇనుప సామాను దుకాణంలో అగ్నిప్రమాదం

హుస్నాబాద్, మార్చి 30 : హుస్నాబాద్ పట్టణం నాగారం రోడ్డులోని ఓ పాత ఇనుపసామాను దుకాణంలో శనివారం అగ్నిప్రమాదం జరిగింది. వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వారు వెంటనే అక్కడికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. దాదాపు రూ. 1.50 లక్షలకు పైగా నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపాడు.

రెగ్యులర్ కాకుండానే పార్ట్ టైమ్ స్వీపర్ ఉద్యోగ విరమణ

నంగునూరు,మార్చి 30 : 39 సంవత్సరాలుగా చాలీచాలని జీతంతో ఉద్యోగం చేస్తున్న పార్ట్ టైం స్వీపర్ మల్లయ్య రెగ్యులర్ కాకుండానే శనివారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పాఠశాల హెచ్ఎం పొన్నమల్ల రాములు ఆయన సేవలను కొనియాడారు.

పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

గజ్వేల్, మార్చి 30: పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని గజ్వేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-1 కోఆర్డినేటర్ విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. గజ్వేల్ మండల పరిధిలోని ధర్మారెడ్డిపల్లి పాఠశాలలో ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరంలో భాగంగా మూడో రోజు ఎన్ఎస్ఎస్ వలంటీర్లు శ్రమదానం నిర్వహించారు. వారివెంట అధ్యాపకులు సుంచు రాజు, సాయికృష్ణ, వైస్ ఎంపీపీ బెల్దే కృష్ణ, పాక్స్ చైర్మన్ జేజాల వెంకటేశ్‌గౌడ్, గ్రామస్తులు సుఖేందర్‌రెడ్డి, వలంటీర్లు పాల్గొన్నారు.

యాదవ సంఘ కార్యవర్గ ఎన్నికలు

హుస్నాబాద్, మార్చి 30 : హుస్నాబాద్ పట్టణ ఆరెపల్లి యాదవ సంఘ కార్యవర్గ ఎన్నికలు శనివారం జరిగాయి. అధ్యక్షుడిగా గొర్ల లింగయ్య యాదవ్, ఉపాధ్యక్షుడిగా కాశబోయిన అశోక్, ప్రధాన కార్యదర్శిగా దొంతరబోయిన హరీశ్, సహాయ కార్యదర్శిగా పోతరబోయిన రవి, కోశాధికారిగా దొంతరబోయిన సాంబరాజు, కార్యవర్గ సభ్యులుగా ఎల్లయ్య, తిరుమలేశు, పర్శరాములు, సాంబరాజు, రమేశ్, శ్రీనివాస్‌లను ఎన్నుకున్నారు.

కోర్టు భవనం నిర్మించాలని మంత్రికి వినతి



మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న న్యాయవాదులు

హుస్నాబాద్, మార్చి 30 : శిథిలావస్థకు చేరిన హుస్నాబాద్ మున్సిఫ్ కోర్టు స్థానంలో నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను స్థానిక బార్ అసోసియేషన్ సభ్యులు కోరారు. ఈ మేరకు శుక్రవారం రాత్రి హైదరాబాద్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కోర్టు సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. ప్రస్తుతం కోర్టు భవన మరమ్మతుల నిమిత్తం రూ. 27లక్షలు మంజూరయ్యాయని, మరమ్మతులు చేయడం వల్ల నిధుల వృథా తప్పా ప్రయోజనం ఉండదని తెలిపారు. హుస్నాబాద్‌లో సబ్ కోర్టు ఏర్పాటు చేయాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు విలాసాగరం మురళీమోహన్, ప్రధాన కార్యదర్శి జులాల్ నాయక్, కన్నోజు రామకృష్ణ, న్యాయవాదులు యాళ్ల శ్రీనివాస్‌రెడ్డి, మిట్టపల్లి ఎల్లారెడ్డి, బాలకిషన్, దీకొండ ప్రవీణ్, సంపత్ తదితరులున్నారు.

ప్రజాపాలనలో భాగస్వాములు కావాలి

● డీసీసీ అధ్యక్షుడు తూముకుంట నర్సారెడ్డి

ములుగు, మార్చి 30: కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజాపాలనలో అందరూ భాగస్వాములు కావాలని సిద్దిపేట జిల్లా డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి అన్నారు. శనివారం ములుగు మండలం కొత్తూరు గ్రామనికి చెందిన బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ నాయకుడు బురం గణేష్‌యాదవ్ తమ్ముని శ్రీనివాస్ ఆధ్వర్యంలో మాజీ సర్పంచ్ శంకర్, మాజీ ఉపసర్పంచ్ స్వామి గౌడ్, మాజీ వార్డ్‌మెంబర్ వెంకటేశ్‌గౌడ్, మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు జోగిని రవి, పలువురు కార్యకర్తలు నర్సారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు.

'హామీలు నెరవేర్చాకే కాంగ్రెస్ ఓట్లు అడగాలి'

చేర్యాల, మార్చి 30: కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చిన తరువాతే పార్లమెంటు ఎన్నికల్లో ఓట్లు అడగాలని బీజేపీ కొమురవెల్లి మండల అధ్యక్షుడు బూర్గోజు నాగరాజు అన్నారు. కొమురవెల్లి మండలం రాంసాగర్ గ్రామంలో శనివారం ఆయన పర్యటించి, ఇంటింటి ప్రచారంలో కేంద్రప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలను వివరించారు. అనంతరం నాగరాజు మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వం దేశానికి అవసరమని, ఆయన నేతృత్వంలో దేశం అభివృద్ధిలో దూసుకుపోతున్నదన్నారు. కార్యక్రమంలో నాయకులు దండ్యాల లక్ష్మారెడ్డి, కుడికుడి మల్లేశం, దండ్యాల భిక్షపతి రెడ్డి, కొయ్యడ మల్లేశం, మద్దికుంట కరుణాకర్, ఈగ కనకయ్య, సంపత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బట్టి విధానానికి స్వస్తి పలకాలి

● జిల్లా జడ్జి బి.రఘురాం



మాట్లాడుతున్న జడ్జి రఘురాం

కొండపాక, మార్చి 30: బట్టి విధానానికి స్వస్తి పలికి పాఠ్యాంశాలను అర్థం చేసుకుంటే విజ్ఞానం పెరుగుతుందని జిల్లా జడ్జి బి.రఘురాం అన్నారు. కొండపాక మండలం శాంభవి పాఠశాలలో శనివారం జిల్లా న్యాయసేవాధికారసంస్థ సిద్దిపేట జిల్లా వారి ఆధ్వర్యంలో లీగల్ అవేర్‌నెస్ ప్రోగ్రాం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజ్యాంగంలో ఉన్న ప్రాథమిక హక్కులు, పోక్సో చట్టాల గురించి పిల్లలకు వివరించారు. పిల్లలు మొబైల్‌ఫోన్స్‌కు దూరంగా ఉండాలని, మొబైల్స్ వాడకం వల్ల పిల్లలు మానసికంగా దెబ్బతిని మెదడు పైన ప్రభావం చూపుతుందన్నారు కార్యక్రములో ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఎస్.స్వాతిరెడ్డి, సిద్దిపేట ఏపీపీ జి.మధు, సీఐ విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో సొసైటీ సేవలు

మద్దూరు, మార్చి 30: రైతులకు అందుబాటులో సొసైటీ సేవలు ఉండేలా చూడనున్నట్లు వైస్ చైర్మన్ ఇర్రి రాజిరెడ్డి తెలిపారు. శనివారం మద్దూరు మండలం రేబర్తి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో సీఈవో బోయిని శ్రీధర్ అధ్యక్షతన మహాజన సభ సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్లు నారోజు శ్రీనివాస్, కొండ అంజయ్య, జగన్, దేవదాసు, మల్లేశం, శ్రీధర్‌రెడ్డి, మోహన్‌రెడ్డితో పాటు రైతులు పాల్గొన్నారు.

'టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలి'

బెజ్జంకి, మార్చి 30: ప్రభుత్వ ఉపాధ్యాయులను టెట్ నుంచి మినహాయించాలని ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘం జిల్లా ఆర్థిక కార్యదర్శి వడ్లకొండ శ్రీనివాస్, మండల శాఖ అధ్యక్షుడు శంకరాచారి, ప్రధాన కార్యదర్శి రామంచ రవీందర్ కోరారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. 2010కి ముందు సర్వీస్‌లోకి వచ్చిన ఉపాధ్యాయులను టెట్ నుంచి మినహించాలని, అది ప్రభుత్వ సర్వీస్‌లో ఉన్న సీనియర్ ఉపాధ్యాయులకు అగ్నిపరీక్ష లాంటిదన్నారు. ఏ పరీక్ష రాయని కాంట్రాక్ట్ లెక్చరర్స్‌ను డైరెక్ట్‌గా జూనియర్ లెక్చరర్స్‌గా నియమించిన ప్రభుత్వం ఇప్పుడు ఎన్నో సంవత్సరాలుగా ఉపాధ్యాయులుగా కొనసాగుతూ, ఏ ప్రమోషన్ లేకుండా ఉన్నవారిని నిరుత్సాహానికి గురి చేయడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో సతీష్ కుమార్, రమేష్, రఘునాథ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ బెదిరింపులకు బీఆర్‌ఎస్ భయపడదు

● పార్టీ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణశర్మ



సిద్దిపేటలో మాట్లాడుతున్న రాధాకృష్ణశర్మ

సిద్దిపేట టౌన్, మార్చి 30: రాష్ట్రంలో ప్రతిపక్ష పార్టీల నాయకులు, కార్యకర్తల మనోధైర్యాన్ని, ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీసేలా కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు చేస్తున్నదని, వారి బెదిరింపులకు బీఆర్ఎస్ భయపడదని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణశర్మ తెలిపారు. శనివారం సిద్దిపేట పట్టణంలోని మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రంగనాయకసాగర్ జలాశయం భూ సేకరణలో భాగంగా మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావుపై అసత్య ఆరోపణలు చేయడం సమంజసం కాదన్నారు. కార్యక్రమంలో నాయకులు కూర మాణిక్యరెడ్డి, కాముని శ్రీనివాస్, ముల్కల కనకరాజు, ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

వీధిరౌడీలా మట్లాడడం మానుకోవాలి

దుబ్బాక, మార్చి 30: సంగారెడ్డి ఎన్నికల ప్రచారంలో దుబ్బాక మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డిపై విధి రౌడీలాగా మాట్లాడడం సిగ్గుచేటని బీఆర్ఎస్ దుబ్బాక మున్సిపాలిటీ అధ్యక్షుడు వంశీకృష్ణాగౌడ్ మండిపడ్డారు. శనివారం దుబ్బాకలో బీఆర్ఎస్ నాయకులతో మాట్లాడారు. హింసను ప్రేరేపించే విధంగా మాట్లాడడం సరైన పద్ధతికాదన్నారు. ఆ వాఖ్యలపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. ఈ సమావేశంలో కౌన్సిలర్లు శ్రీనివాస్, బాలకిషన్, స్వామి, యాదగిరి, స్వామి, బీఆర్ఎస్ నాయకులు రొట్టె రాజమౌళి, భూంరెడ్డి, బాలకిషన్, సంజీవరెడ్డి, మల్లయ్య, లచ్చయ్య తదితరులున్నారు.

రానున్న ఎన్నికలలో మతోన్మాద బీజేపీని ఓడించాలి

● ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మణికంఠరెడ్డి

సిద్దిపేట అర్బన్, మార్చి 30: ప్రజా, విద్యార్థి వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న బీజేపీని రానున్న ఎన్నికలలో చిత్తుగా ఓడించాలని ఏఐఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి పేర్కొన్నారు. శనివారం సిద్దిపేటలో ఏఐఎస్ఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాజ్యాంగ మౌలిక సూత్రాలకు వ్యతిరేకంగా తీసుకొచ్చిన నూతన విద్యా విధానం, జాతీయ విద్యా విధానం లోపాల పుట్టగా ఉన్నాయని అన్నారు. విద్య కాషాయీకరణ, ప్రైవేటీకరణ, కేంద్రీకరణ కోసమే నూతన విద్యా విధానాన్ని తీసుకువచ్చారని విమర్శించారు. సమావేశం అనంతరం ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శిగా ప్రసన్నకుమార్, గర్ల్స్ కన్వీనర్‌గా శిరీషను ఎన్నుకున్నారు. సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మధు, కార్యదర్శి జనార్దన్, వర్కింగ్ ప్రెసిడెంట్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

శిఖం భూమి కబ్జాను అడ్డుకోవాలి

● బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ యాదవ్

సిద్దిపేట క్రైం, మార్చి 30: సిద్దిపేట మున్సిపల్ పరిధిలోని 13 వార్డులో ఉన్న శంకరయ్య కుంట చెరువు శిఖం భూమిని మట్టి పోసి కబ్జా చేశారని, దీనిని అధికారులు అడ్డుకోవాలని బీజేపీ జిల్లా కార్యదర్శి పత్రి శ్రీనివాస్ యాదవ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం అర్బన్ తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ.. సర్వేనెంబర్ 2015లో 5 ఎకరాల 7 గుంటల విస్తీర్ణం గల స్థలాన్ని ఆక్రమించి మట్టి పోశారని ఆరోపించారు. కార్యక్రమంలో సీనియర్ బీజేపీ నాయకులు గుండ్ల జనారన్, ఎలుక ఎల్లం, అభిషేక్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో అవస్థలు

దౌల్తాబాద్, మార్చి 30: చిన్నారుల సంక్షేమానికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన సమగ్ర శిశు సంక్షేమ(ఐసీడీఎస్) శాఖ పనితీరు విమర్శలకు లోనవుతున్నది. అద్దె గదుల్లో, కమ్యూనిటీ హాళ్లల్లో ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ కేంద్రాల్లో సదుపాయాలు లేక చిన్నారులు, గర్భిణులు, తల్లులు అవస్థలకు గురవుతున్నారు. ఫ్యాన్లు లేకపోవడంతో వేసవి వేడికి పిల్లలు మగ్గిపోతున్నారు. ఫ్యాన్లు లేకుండా చిన్నారులు ఎలా ఉంటారని తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా వసతులు కల్పించాల వేడుకుంటున్నారు.

ఉద్యోగ విరమణ వృత్తికే.. వ్యక్తిత్వానికి కాదు

● అడిషనల్ డీసీపీ మల్లారెడ్డి

సిద్దిపేట క్రైం, మార్చి 30 : పోలీసు రిటైర్మెంట్ వృత్తికే కానీ వ్యక్తిత్వానికి కాదని జిల్లా అడిషనల్ డీసీపీ మల్లారెడ్డి అన్నారు. సీసీఎస్ ఎస్ఐ గాంధీ గౌడ్, మర్కుక్ పోలీస్‌స్టేషన్ ఏఎస్ఐ తాటికొండ పరిపూర్ణాచారి ఉద్యోగ విరమణ సందర్భంగా సిద్దిపేట పోలీస్ కమిషనర్ కార్యాలయంలో వారిని ఘనంగా సన్మానించి మాట్లాడారు. కార్యక్రమంలో ఏవో యాదమ్మ, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్, రాష్ట్ర పోలీసు సంఘం ఉపాధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

హుస్నాబాద్, మార్చి 30: హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా పౌరసరఫరాల అధికారి తనుజా ప్రారంభించారు.

'సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి'



సమావేశంలో మాట్లాడుతున్న శెట్టిపల్లిసత్తిరెడ్డి

చేర్యాల, మార్చి 30: కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయంలో గత పాలకమండలి ఆధ్వర్యంలో చేపట్టిన పనుల్లో జరిగిన అవినీతిపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని సీపీఎం మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. దాసారంగుట్ట అప్రోచ్‌రోడ్డు నిర్మాణం పేరిట రూ.45కోట్లు దుర్వినియోగం చేశారని ఆరోపించారు. సమావేశంలో పార్టీ నాయకులు తాడూరి రవీందర్, తేలు ఇస్తారి, తాడూరి మల్లేశం, నీల భిక్షపతి, చింతల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మల్లన్న భక్తులపై దాడి

చేర్యాల, మార్చి 30: కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయ ఆవరణలో చెప్పులు భద్రపరిచే స్టాండు నిర్వహకులు ఇరువురు భక్తులపై దాడికి పాల్పడిన సంఘటన శనివారం చోటుచేసుకున్నది. హైదరాబాద్‌లోని షాద్‌నగర్‌కు చెందిన యాదయ్య, ఎల్లవ్వ కుటుంబసభ్యులతో మల్లన్న దర్శనార్థం కొమురవెల్లికి వచ్చారు. ఆలయ సమీపంలోని చిరుదుకాణంలో మొక్కుబడి సామాగ్రి కొనుగోలు చేసిన తదుపరి అదేదుకాణం ఆవరణలో పాదరక్షలు విడిచిపెట్టి దర్శనానికి వెళ్లారు. ఆలయ ఆవరణలో చెప్పులు భద్రపరిచే స్టాండు నిర్వహణ వేలంపాట పొందిన టెండర్‌దారులు వారి చెప్పులను తీసుకునివెళ్లి స్టాండులో భద్రపరిచారు. తీరా దర్శనం చేసుకుని వచ్చిన వారు చెప్పుల గురించి ఆరా తీయడంతో వేలంపాటదారుడి సిబ్బంది తీసుకువెళ్లారని తెలపడంతో వారివద్దకు వెళ్లి తమ చెప్పులు ఇవ్వాలని కోరారు. కానీ డబ్బులు ఇస్తేనే చెప్పులు ఇస్తామని సిబ్బంది పేర్కొనడంతో మాటామాటా పెరిగింది. దీంతో స్టాండుని ర్వహకులు రాడ్‌తో భక్తులపై దాడి చేయడంతో ఇరువురికి గాయాలయ్యాయి. గలాటా విషయాన్ని స్థానిక పోలీసులకు తెలపడంతో చికిత్స నిమిత్తం కొమురవెల్లి పీహెచ్‌సీకి తరలించారు.

ప్రశాంతంగా ముగిసిన పది పరీక్షలు



నంగునూరులో పరీక్ష కేంద్రం నుంచి బయటకు వస్తున్న విద్యార్థులు

నంగునూరు, మార్చి 30 : మండలంలో పదో తరగతి పరీక్షలు శనివారంతో ముగిశాయని ఎంఈవో తగిరెడ్డి దేశిరెడ్డి తెలిపారు. ఏప్రిల్ 1న అక్కెనపల్లి మోడల్ స్కూల్లో ఒకేషనల్ పరీక్ష ఉంటుందన్నారు. పరీక్షల నిర్వహణకు సహకరించిన అధికారులకు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

● హుస్నాబాద్: పది పరీక్షలు హుస్నాబాద్ పట్టణంలో ప్రశాంతంగా ముగిశాయి. హుస్నాబాద్‌లో నాలుగు పరీక్ష కేంద్రాలుండగా మొత్తం 822 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. పరీక్షలు ముగియడంతో హాస్టళ్ల విద్యార్థులు బాయ్ బాయ్ చెప్పుకుంటూ ఇంటికి పయనమైయ్యారు.

● దుబ్బాక/మిరుదొడ్డిదుబ్బాక: మిరుదొడ్డి మండలంలో పది పరీక్షలు శనివారం ప్రశాంతంగా ముగిశాయని దుబ్బాక ఎంఈవో ప్రభుదాస్ తెలిపారు. పరీక్షలకు సహకరించిన అధికారులకు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.



హుస్నాబాద్‌లో పరీక్ష కేంద్రం నుంచి బయటకు వస్తున్న విద్యార్థులు